క్లుప్తంగా

వినాయక ఘాట్ పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్

కర్నూలు (టౌన్): నగరంలోని వినాయక ఘాట్ వద్ద పరిశుభ్రత చర్యలు చేపట్టాలని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ ఆదేశించారు. వినాయక ఉత్సవాలు, నిమజ్జనం నేపథ్యంలో కమిషనర్ అధికారులతో కలిసి ఘాట్‌ను పరిశీలించారు. ఘాట్ వద్ద పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. లోటుపాట్లు లేకుండా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే నగరంలోని 17, 18వ వార్డుల్లో కమిషనర్ పర్యటించారు.

మురుగు కాల్వల ఆక్రమణపై చర్యలు

నగరంలోని కిమ్స్ హాస్పిటల్ సమీపంలో మురుగు కాల్వలకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణలను తొలగించాలని కమిషనర్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఆరోగ్య శాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, డీసీపీ సంధ్యారాణి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే కర్నూలు క్రీడా కేంద్రంగా నిలుస్తుంది

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం ప్రోత్సహిస్తే కర్నూలు క్రీడల్లో ప్రముఖ కేంద్రంగా నిలిస్తుందని ఏపీ భారీ పరిశ్రమలు, ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీలో గురువారం నిర్వహించిన పరిశ్రమలు, వాణిజ్య మంత్రుల సదస్సుకు హాజరైన మంత్రి టీజీ భరత్ రాత్రి కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, క్రీడలు, యువజన వ్యవహారాలశాఖ మంత్రి మాన్‌సుఖ్ ఎల్.మాండవీయను మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలులో ఆధునిక స్టేడియం, అత్యున్నత స్థాయి కోచ్‌ల నియామకంతో పాటు క్రీడా సౌకర్యాలు మెరుగుపరచాలని కోరారు.

బీజేపీతో కార్మిక చట్టాల నిర్వీర్యం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తోందని, ఫలితంగా కార్మికులు రోడ్డున పడుతున్నారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. గురువారం ఓల్డ్‌సిటీలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): పట్టణాల్లోని దళిత వాడల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యూటీఎఫ్ కార్యాలయంలో 19, 20 వార్డుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలోనే దళితవాడల అభివృద్ధి కోసం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను తీసుకొచ్చినా అమలు చేయడం లేదన్నారు. దీంతో దళితవాడల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయా వార్డుల కమిటీలను ఎన్నుకున్నారు.

ఏబీసీడబ్ల్యూఓ బాధ్యతల స్వీకరణ

కర్నూలు(అర్బన్): రూరల్ సహాయ బీసీ సంక్షేమాధికారిగా పదోన్నతి పొందిన ఎం.శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఏబీసీడబ్ల్యూఓగా ఉన్న ఎస్.లీలావతి ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రూరల్ పరిధిలోని పలువురు వసతి గృహ సంక్షేమాధికారులు నూతన ఏబీసీడబ్ల్యూఓకు పూలమాల వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఏబీసీడబ్ల్యూఓ శ్రీనివాసులు మాట్లాడుతూ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

విజయవాడకు తరలిన సిబ్బంది

కర్నూలు (టౌన్): వరద విలయంలో చిక్కుకున్న విజయవాడ నగరంలో సహాయక చర్యల కోసం నగరపాలక సంస్థకు చెందిన రెండవ బృందం గురువారం బయలుదేరి వెళ్లింది. 20 మంది శానిటేషన్ కార్యదర్శులు, 100 మంది కార్మికులు ఈ బృందంలో ఉన్నారు. నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు జెండా ఊపి వారిని బస్సులో సాగనంపారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలోని విద్యుత్ శాఖ 11 కేవీ సిరినోబుల్ ఫీడర్‌లో మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 12 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ నాగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ బ్యాంకు ఆఫీసర్స్ కాలనీ, అమీన్ హైదర్ నగర్, సుంకేసుల రోడ్, ధనలక్ష్మి నగర్, శ్రీనగర్ కాలనీ, జనార్దన్ నగర్, వసంత రెసిడెన్సీ, తుంగభద్ర కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

వినాయక విగ్రహాల పంపిణీ

కర్నూలు (హాస్పిటల్): మట్టి వినాయక విగ్రహాలను పూజించడం వల్ల పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్ శర్మ చెప్పారు. స్థానిక బండిమెట్ట వీధిలో గురువారం ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ప్రమాదకర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు గాకుండా మట్టితో చేసిన ప్రతిమలను పూజించి నిమజ్జనం చేయాలని సూచించారు.

కర్నూలు కల్చరల్: పాతబస్టాండ్‌లోని వాసవీ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ పాల్గొన్నారు. దాదాపు 1000 వినాయక విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, నిర్వాహకులు శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

గురుభ్యోనమః

దేశ మొదటి ఉపరాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ట్రెజరీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్



రజక సామాజికవర్గ ఉపాధ్యాయులకు సన్మానం

కర్నూలు(అర్బన్): విద్యాబుద్ధులు నేర్పించే గురువు స్థానం గొప్పదని రజక సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు అన్నారు. బుధవారపేటలోని ఎంఏహెచ్ అప్పా స్కూల్‌లో గురువారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కడుమూరు రవి అధ్యక్షతన జిల్లాలోని రజక ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం జరిగింది. న్యాయవాది చంద్రశేఖర్, నాయకులు కేతూరు మధు, గోల్డ్‌మెన్ శ్రీనివాసులు, ఏఎస్ఐ నరసింహులు, నాటూరు వెంకటేశ్వర్లు, బీసన్న, అంజి తదితరులు పాల్గొని. రజక సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కలెక్టరేట్‌లోని ట్రెజరీ బ్రాంచ్ అధికారులు ఉపాధ్యాయులను సత్కరించారు. కలెక్టరేట్ పక్కన ఉన్న ఇందిరాగాంధీ స్మారక నగర పాలక ఉన్నత పాఠశాలలో ప్రధానోపధ్యాయుడు వెంకటేశులుతో సహా 52 మంది టీచర్లను ఘనంగా సత్కరించారు. చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పే గురువులను సత్కరించడం గొప్ప విషయమని అన్నారు. మేనేజర్ శివకుమార్, డీఎం ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం ట్రెజరీ బ్రాంచి అధికారులు డీఈఓను ఆయన చాంబరులో కలసి సత్కరించారు.

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం, డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థల్లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు ప్రిన్సిపాల్ సి.వి.కృష్ణారెడ్డి, ఆచార్య భరత్‌కుమార్, ఉర్దూ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీఎస్ షావలి ఖాన్, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: నగరంలోని పలు పాఠశాలలు, కాలేజీల్లో గురువారం గురు పూజోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- సిరాక్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో జరిగిన వేడుకల్లో స్కూల్ అధినేత జి.ఎం.డి ఇబ్రహీం పాల్గొన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.
- మాధవ నగర్‌లోని నారాయణ స్కూల్‌లో ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టీచర్ల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు.
- క్లస్టర్ వర్సిటీ పరిధిలోని సిల్వర్‌జూబ్లీ కాలేజీలో జరిగిన వేడుకల్లో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వి.ఎస్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.
- స్థానిక మాధవీనగర్, రెవెన్యూ కాలనీలోని సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యా సంస్థల్లో జరిగిన వేడుకల్లో కరెస్పాండెంట్ పి.బి.వి సుబ్బయ్య పాల్గొన్నారు. టీచర్లకు సన్మానం చేశారు.
- కేవీఆర్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో కరెస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ విజయలక్ష్మీ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.
- ఉస్మానియా డిగ్రీ కాలేజీలో వేడుకల్లో సయ్యద్ సమీవుద్దీన్ ముజమ్మిల్, డాక్టర్ మండి అన్వర్ హూసేన్ పాల్గొన్నారు.
- ప్రభుత్వ వొకేషనల్ కాలేజీ వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామినాయక్ తదితరులు పాల్గొన్నారు.
- శ్రీశంకరాస్ డిగ్రీ కాలేజీలో డైరెక్టర్ హరికిషన్, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- మదర్ థెరిసా ఫార్మసీ కాలేజీలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ వేడుకల్లో పాల్గొన్నారు.
- క్లస్టర్ యూనివర్సిటీలో నిర్వహించిన వేడుకల్లో రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు, డీన్ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ హెచ్.అక్తర్ బాను, పరీక్షల విభాగం డీన్ డాక్టర్ కె.నాగరాజు శెట్టి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పండుగ చేద్దాం.. ప్రమాదాలను నివారిద్దాం

- హంగులు, ఆర్భాటాలతో ప్రమాదాల బారిన పడొద్దు
- ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి
- 15న నిమజ్జనోత్సవం



కర్నూలు కల్చరల్: గణేష్ ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. విగ్రహాల ఏర్పాటు పనులు ముమ్మరం అయ్యాయి. ఈ నెల 7వ తేదీన లంబోదరుడు కొలువుదీరనున్నాడు. ఉత్సవ కమిటీలు ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 12 వేల విగ్రహాలు, కర్నూలు నగరంలో 2800 వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు గణేష్ మహోత్సవ కేంద్ర సమితి వారు వెల్లడించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే వేడుకల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొననున్నారు. భారీ పందిళ్ల నిర్మాణం మొదలైంది. పెద్ద విగ్రహాలను ముందే తీసుకొచ్చి కూడళ్లలో వేదికల వద్ద సిద్ధంగా ఉంచారు. ఇలాంటి పరిస్థితుల్లో భక్తితో పాటు భద్రతా ముఖ్యమే. ప్రమాద రహితంగా వేడుకలను నిర్వహించేందుకు గణేశ్ ఉత్సవ కేంద్ర సమితి, విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు కొన్ని సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఉత్సవ సమితి ప్రతినిధులు వాటిని పాటిస్తూ సంస్కృతి సంప్రదాయాలు, భక్తి భావాలు వెల్లివిరిసేలా, పవిత్రతను కాపాడుకుంటూ వేడుకలు నిర్వహించాలని సూచిస్తున్నారు.

వినాయక పందిళ్ల నిర్మాణంలో జాగ్రత్తలు ఇలా..

- విశాలమైన ప్రాంతాల్లో మండపాలను ఏర్పాటు చేసుకోవాలి.
- వర్షాలు కురుస్తున్నందున తడికెలతో గాకుండా ఆస్‌బెస్టాస్ రేకులతో నిర్మించుకోవడం మంచిది.
- వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట, విద్యుత్ వైర్ల కింద ఏర్పాటు చేయకూడదు.
- విద్యుత్ శాఖ అధికారుల అనుమతి పొందాలి.
- వినాయక ప్రతిమల ఎదుట ఉంచే దీపాలపై నిరంతర నిఘా ఉండాలి.
- మండపాల సమీపంలో బాణాసంచా కాల్చరాదు.
- పెట్రోల్, కిరోసిన్, గ్యాస్ సిలిండర్లను మండపాల వద్ద ఉంచరాదు.
- ఇసుక, నీరు, అగ్ని నిరోధక పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలి.
- పోలీస్, అగ్నిమాపక, విద్యుత్తు, వైద్య శాఖ అధికారుల నంబర్లు ఉంచుకోవాలి.

ప్రశాంతత ముఖ్యం

- రాత్రిళ్లు పెద్ద శబ్దాలతో మైకులు పెట్టరాదు.
- మండపాల వద్ద శుభ్రత పాటించాలి. భక్తులకు తాగునీరు అందుబాటులో ఉంచాలి.
- ఆధ్యాత్మికత ఉట్టి పడేలా కార్యక్రమాలు నిర్వహించాలి

ఉత్సవ సమితులకు సూచనలు

- గణనాథుడిని భగవంతుని ప్రతిరూపంగా భావించి, ఆ రూపం చెడకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలి.
- సినిమాల్లోని పాత్రలు, రూపాలు వచ్చేలా ప్రతిమలు ఏర్పాటు చేయకూడదు.
- రోజూ ఉదయం, రాత్రి 8 గంటలకు మహా మంగళ హారతి నిర్వహించాలి.
- సామూహిక పూజలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు ఏర్పాటు చేయాలి.
- పిల్లలు, మహిళలకు వివిధ రకాలు పోటీలు నిర్వహించాలి.
- మండపాల వద్ద అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకుందాం



వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకునేందుకు అందరూ సహకరించాలి. గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి సూచనలు తప్పనిసరిగా స్థానిక కమిటీల వారు పాటించాలి. ప్రస్తుతం 44వ సంవత్సరం వేడుకలు నిర్వహించుకుంటున్నాం. వినాయక మండపాల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలు పాటించాలి. సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా మామిడాకులు, అరటి తోరణాలు లాంటి వాటితో మండపాలను అలంకరించుకోవాలి. మండలపాల వద్ద మద్యం సేవించడం, జూదమాడటం లాంటి అసాంఘిక చర్యలకు పాల్పడకూడదు. పండుగ పవిత్రతను కాపాడుకోవాలి.

– డాక్టర్ పి.మోక్షేశ్వరుడు, నగర అధ్యక్షుడు, గణేష్ మహోత్సవ కేంద్ర సమితి

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కర్నూలు (లీగల్): ఆటోడ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించి ఆటో నడపాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి అడిగినప్పుడల్లా చూపించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. గురువారం అంబేడ్కర్ భవన్‌లో ఆటోడ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇన్సూరెన్స్ లేని ఆటోలు నడపరాదని, వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు వెంట ఉంచుకోవాలన్నారు. కంపెనీ వారు అమర్చిన హారన్ మాత్రమే ఉండాలని, ఆటో ముందు భాగంలో అభిమాన తారల పోస్టర్లు, ప్రకటనలు ఉండరాదని సూచించారు. ప్రతి ఆటోకు రిజిస్ట్రేషన్ నంబర్, ట్రాఫిక్ పోలీసు వారి టాప్ నంబరు తప్పనిసరిగా ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. ఆటోస్టాండ్‌ల వద్ద మాత్రమే ఆటోలను నిలుపుకోవాలని, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ, ఫ్రీ లెఫ్ట్ ప్రదేశాలలో నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని సూచించారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి గుండె, కంటి పరీక్ష, బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేశారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, వైద్యులు రాఘవ, కె.అరుణ, ఎ.సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

గుర్తింపు కార్డు ఉంటేనే రైతుబజారులో చోటు

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు(అగ్రికల్చర్): గుర్తింపు కార్డులు కలిగిన రైతులు మాత్రమే సీ.క్యాంపు రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు అమ్ముకునే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండా తిష్ట వేసిన దళారులను బుధ, గురువారాల్లో బయటికి పంపారు. రైతుబజారులో దళారుల దందాపై ఈ నెల 4వ తేదీన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా స్పందించారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తిని ఆదేశించారు. దీంతో రైతుబజారు ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంట్ శివకుమార్ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. రైతుబజారులో కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లు అమ్ముకునేందుకు గుర్తింపు కార్డు ఉన్న వారికి మాత్రమే అవకాశం కల్పిస్తూ లేనివారిని బయటకు పంపుతున్నారు. ఈ ప్రక్రియ నిరంతరం జరుగుతుందని ఎస్టేటు అధికారి హరీష్ కుమార్ తెలిపారు. అలాగే బోర్డుపై రాసిన ధరలకే కూరగాయలు విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే కాటాలు స్వాధీనం చేసుకొని బయటికి పంపుతామని హెచ్చరించారు. అల్లం వ్యాపారంలో దందాపై దృష్టి సారించామని, సెక్యూరిటీ సిబ్బంది అల్లం సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తూకాలు సక్రమంగా వేసేలా ఆకస్మిక తనిఖీలు చేపడతామని స్పష్టం చేశారు.



రైతుబజారులో కాటాను పరిశీలిస్తున్న ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కర్నూలు: స్థానిక లక్ష్మీనగర్‌లో మోటార్ సైకిళ్లకు సీటు కవర్లు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్న సయ్యద్ మహమ్మద్ షరీఫ్ (41) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఆయన పనిచేసే చోట రవి కలెక్షన్స్ బట్టల దుకాణం ఉంది. దుకాణం నేమ్ బోర్డును సెకండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసేందుకు మహమ్మద్ షరీఫ్ సహాయం చేస్తుండగా పక్కనే ఉన్న కరెంటు వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. ఘటనపై భార్య సయ్యద్ రసూల్‌బాను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు మూడవ పట్టణ పీఎస్ సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

పార్టీ ప్రతిష్ట పెంచేందుకు కృషి

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ ప్రతిష్ఠ పెంచేందుకు కృషి చేస్తానని పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన ఎస్వీ మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక గిప్సన్ కాలనీలోని ఆయన స్వగృహంలో ఎస్వీ మోహన్‌రెడ్డిని 33 వార్డులకు చెందిన ఎస్వీ యూత్ సభ్యులు, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. అందరిని కలుపుకొని పోయి కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. కార్పొరేటర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎస్వీ దంపతులను సత్కరిస్తున్న యూత్ సభ్యులు

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

కర్నూలు(హాస్పిటల్): విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ఎక్కడికక్కడ వర్షపు నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసాలుగా మారడంతో జ్వరాలు విజృంభిస్తున్నాయని, ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా మెడికల్ క్యాంపులు నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏఓ అరుణకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. విషజ్వరాలతో ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే యాజమాన్యాలు వేలాది రూపాయలు ఫీజు వసూలు చేస్తున్నారని విమర్శించారు. వీటిని అరికట్టాలని కోరారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నగర కార్యదర్శి బీసన్న, నాయకులు నాగేశ్వరరావు, సురేంద్రయాదవ్ ఉన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. గురువారం స్థానిక ఎర్రబురుజు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కర్నూలు నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే ఐరన్‌ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడటం వల్ల రక్తహీనత సమస్య రాదన్నారు. శరీరంలో ఐరన్ చాలా కీలకమైనదని, ఆహారంలో ఐరన్ లోపం ఉంటే రక్తం ఎర్రగా ఉండే గుణాన్ని తగ్గిస్తుందన్నారు. ఎర్ర రక్తకణాల్లో హిమోగ్లోబిన్ పరిమాణాన్ని తగ్గిస్తుందని, ఈ స్థితిని రక్తహీనత అంటారన్నారు. ఈ కారణంగా విద్యార్థులు నీరసం, నిస్సత్తువ పెరిగి చదువుల్లో వెనుకబడిపోతారన్నారు. హిమోగ్లోబిన్ శాతం పెరిగేందుకు ఎండుద్రాక్ష, పాలు, పండ్లు, గుడ్లు, వేరుశనగతో కలిపిన బెల్లం, ఆకుకూరలు మొదలైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. డిప్యూటీ మాస్ మీడియా అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, రాములమ్మ, ఉపాధ్యాయులు, సచివాలయ ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు

తెల్లసుద్ద లారీ పట్టివేత

కర్నూలు (టౌన్): తెల్లసుద్దను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను మైనింగ్ అధికారులు గురువారం పట్టుకున్నారు. ప్యాపిలి సమీపంలో టిప్పర్‌ను ఆపి తనిఖీ చేయగా రాయల్టీ అనుమతులు లేకపోవడంతో రూ.25 వేలు జరిమానా వసూలు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ డీడీ రాజశేఖర్ వెల్లడించారు. విజిలెన్స్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, బాలునాయక్ పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

కర్నూలు: స్థానిక దేవనగర్ రైల్వేట్రాక్ వద్ద జోరుగా మట్కా సాగుతున్నట్లు సమాచారం అందడంతో మూడవ పట్టణ ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో దాడి చేసి నలుగురు మట్కా బీటర్లను అరెస్టు చేశారు. బుధవారపేటకు చెందిన షేక్షావలి, షబ్బీర్ అహ్మద్, సర్దార్ బాషా, దేవనగర్ హుసేన్ బాషా మట్కా చీటీలు రాస్తుండగా అదుపులోకి తీసుకుని రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్య పరికరాల పరిశీలన తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని అన్ని వైద్యపరికరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి అన్నీ పనిచేసేలా హెచ్ఓడీలు చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆయన గురువారం ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ రేడియాలజీ విభాగంలో నాలుగు ఎక్స్‌రేలు ప్రారంభిస్తే ఒకటి మాత్రమే ఉపయోగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగితా మూడు ఎక్స్‌రే మిషన్లు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సీటీ స్కాన్‌ను పరిశీలించిన ఆయన సేవలపై ఆరా తీశారు. స్కానింగ్ రిపోర్ట్‌లను వేగంగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. అలాగే ల్యాబ్ వైద్యపరీక్షల నివేదికలను రిజిస్టర్ చేసుకుని ఆయా విభాగాలకు త్వరగా అందించాలని సిబ్బందికి చెప్పారు. ఆసుపత్రిలో ప్రతి రోజూ కుళాయిలు, గేటు, ఇతర వస్తువుల చోరీ జరుగుతుంటే సెక్యూరిటీ సిబ్బంది ఏమి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన నష్టానికి సెక్యూరిటీ ఏజెన్సీకి రూ.20 వేల పెనాల్టీ విధించినట్లు తెలిపారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్ తదితరులు ఉన్నారు.



ఆస్పత్రికి మంజూరైన దుప్పట్లను అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు

20 వేల దుప్పట్లు మంజూరు

ఆస్పత్రి పడకలపై రోజూ దుప్పట్లు మార్చడం వల్ల రోగులు త్వరగా కోలుకుంటారని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన గురువారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో నూతన సప్తవర్ణ దుప్పట్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..ఆస్పత్రికి మంజూరైన 20 వేల దుప్పట్లను అన్ని విభాగాలకు అందించనున్నట్లు చెప్పారు. వార్డులో ఏ రోజుకారోజు దుప్పట్లను మార్చడం వల్ల ఇన్‌ఫెక్షన్ రేటు తగ్గడంతో పాటు పడకలు శుభ్రంగా ఉంటాయన్నారు. తద్వారా రోగులు త్వరగా కోలుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సీఎం సహాయనిధికి విరాళాలు

కర్నూలు(సెంట్రల్): విజయవాడ వరద బాధితుల సహాయార్థం పలువురు సీఎం సహాయనిధికి విరాళాలు అందిస్తున్నారు. సిగాచి ఇండస్ట్రీస్ ప్రాజెక్టు ఇంజినీర్ నలినీకాంత్ రాజు రూ.లక్ష, సిండికేట్ బ్యాంకు రిటైర్డ్ ఎంప్లాయిస్ మ్యూచువల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటీ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, రిజ్వానబేగం, ప్రభాకర్ రూ.లక్ష, ఆదోని మహాయోగి లక్ష్మమ్మ కో–ఆపరేటివ్ బ్యాంకు తరఫున డీసీఓ రామాంజనేయులు రూ.5 లక్షల చెక్కును కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు అందజేశారు. దాతలను కలెక్టర్ అభినందించారు.

మద్యం కేసులో కారు సీజ్

కర్నూలు: కర్నూలు మండలం పంచలింగాల సరిహద్దు చెక్‌పోస్టు వద్ద కారులో మద్యం పట్టుబడింది. సెబ్ సీఐ తిరుమలయ్య సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా అలంపూరు వైపు నుంచి కర్నూలుకు వస్తున్న కారులో నాలుగు తెలంగాణ మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. కారులో ఉన్న ఆదోని పట్టణానికి చెందిన కె.పి.ఉదయ్‌బాలాజీ, బి.ప్రణీత్ కుమార్‌లను విచారించగా గణేష్ విగ్రహాన్ని తీసుకువెళ్తూ మార్గం మధ్యలో తమ డ్రైవర్ల కోసం మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్నట్లు తెలిపారు. వారిద్దరిపై కేసు నమోదు చేసి కారును సీజ్ చేసి కర్నూలు సెబ్ స్టేషన్‌కు తరలించారు.

టిడ్కో గృహాలను పూర్తి చేయాలి

కర్నూలు (టౌన్): 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ధర్నా నిర్వహించారు. గృహాలను పూర్తిచేసి అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.